## క్లుప్తంగా

### నేడు కృష్ణగిరిలో సమావేశం

**కృష్ణగిరి:** మండల కేంద్రమైన కృష్ణగిరిలో శుక్రవారం ఉదయం 10 గంటలకు గ్రామ వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల వలంటీర్లు, కన్వీనర్లు, సారథులతోపాటు పార్టీ నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

### 5 నుంచి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ

**ఎమ్మిగనూరురూరల్:** మండల పరిధిలోని రాళ్లదొడ్డి గ్రామంలో మారెమ్మ, సుంకులమ్మవ్వల దేవర పురస్కరించుకొని ఈ నెల 5 నుంచి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. పోటీల్లో పాల్గొనే వారు రూ.600 ఎంట్రీ ఫీజు చెల్లించి 3వ తేదీలోపు జట్టు పేరు నమోదు చేసుకోవాలన్నారు. మొదటి బహుమతి రూ.20,016, రెండవ బహుమతిగా రూ.15,016 అందించనున్నట్లు చెప్పారు. వివరాలకు 93989 44628, 77993 73637 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### ఎమ్మిగనూరులో 4న జాబ్‌మేళా

**గోనెగండ్ల:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ డీఆర్‌డీఏ వారి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఈ నెల 4న డీఆర్‌డీఏ ట్రైనింగ్ సెంటర్, వీవర్స్ కాలనీ ఎమ్మిగనూరులో జాబ్ మేళా ఉంటుందని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. జాబ్ మేళాలో పలు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు ఉద్యోగాల భర్తీ కోసం అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటిఐ, డిప్లొమా, ఎంబీఏ, బీటెక్ చదివి 18 – 35 ఏళ్ల వయసు వారు అర్హులన్నారు.

**నేడు పత్తికొండలో..**

**మద్దికెర:** పత్తికొండలోని డిగ్రీ కళాశాలలో నేడు రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జేకేసీ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సూర్యచంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహించడం జరుగుతుందని, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ అర్హత కలిగిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### నిరుద్యోగులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

**ఆలూరు రూరల్:** ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా స్కిల్ అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఆలూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్‌ప్రసాద్ తెలిపారు. వారు గురువారం మాట్లాడుతూ.. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 4వ తేదీలోపు స్థానిక కళాశాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అకౌంట్ ఎగ్జిక్యూటివ్, (ట్యాలీ విత్ జీఎస్టీ), సీఎంఆర్ డొమెస్టిక్ నాన్ వాయిస్ (కంప్యూటర్ కోర్సు, ఐటీ సెక్టార్) విభాగంలో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. వివరాలకు 9010003132,63002 30937 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

**వెల్దుర్తి:** ఈనెలాఖరులోపు నిర్మాణంలో ఉన్న అన్ని ఇళ్లు పూర్తి అయ్యేలా చూడాలని హౌసింగ్ ఎస్‌ఈ నాగభూషణం సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన హౌసింగ్ ఈఈ నాగరాజు, డీఈ గురుప్రసాద్‌లతో కలిసి మండల కేంద్రంతో పాటు రత్నపల్లె, రామళ్లకోట లేఅవుట్లు, ఆయా గ్రామాల్లోని వ్యక్తిగత ఇళ్ల నిర్మాణాలను తనిఖీ చేశారు. వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడి వెంటనే పూర్తయ్యేలా చూడాలన్నారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ భవనంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. బిల్లులు త్వరితగతిన లబ్ధిదారులకందేలా చూస్తూ నిర్మాణాల్లో వేగం పెంచాలన్నారు. ఉగాది నాటికి గృహ ప్రవేశాలు చేయించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి తగ్గట్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇన్‌చార్జ్ ఏఈ అరవింద్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు గిడ్డయ్య, యాసిన్ పాల్గొన్నారు.

### 91.43 శాతం పింఛన్ల పంపిణీ

**నందవరం:** ప్రతి నెలా 1వ తేదీ వచ్చిందంటే పింఛన్‌దారులకు పండుగే. తెల్లవారుజాము నుంచే వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేస్తున్నారు. నందవరం మండలంలో గురువారం నాటికి 91.43 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. మిగిలిన వారికి శుక్రవారం పంపిణీ చేసి వంద శాతం లక్ష్యాన్ని నెరవేరుస్తామన్నారు.

### 24 ఏళ్ల తర్వాత తెప్పోత్సవానికి ఏర్పాట్లు

**మద్దికెర:** మండల కేంద్రంలోని మద్దమ్మ బావిలో 24 ఏళ్ల తర్వాత తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు గురువారం తెలిపారు. గతంలో వర్షాలకు మద్దమ్మకుంటలో నీరు వస్తేనే బావిలో సమృద్ధిగా నీరు ఉండేది. గత కొన్నేళ్లుగా బావిలో నీరు లేకపోవడంతో ఉత్సవాలు నిర్వహించలేదు. మూడేళ్ల క్రితం హంద్రీ-నీవా కాలువ నుంచి మద్దమ్మ కుంటకు పైపులైన్ ఏర్పాటు చేసి 24 గంటలు నీటిని పంపింగ్ చేస్తుండడంతో గ్రామంలోని బావులు, బోర్లలో భూగర్భ జలాలు పెరిగి నీటి సమస్య తీరింది. ప్రస్తుతం బావిలో నీరు సమృద్ధిగా ఉండడంతో ఆంజనేయ,శివాలయంలో కొలువైన స్వామి వార్ల తెప్పోత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత తెప్పోత్సవం నిర్వహిస్తుండడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి
- జొన్నగిరిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'
- టీడీపీకి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీలో చేరిక


పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

**తుగ్గలి:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా భావించి స్థానిక ప్రజాప్రతినిధులతో నిర్వహిస్తున్న 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు సకాలంలో పరిష్కారమవుతున్నాయని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. గురువారం మూడో రోజు జొన్నగిరిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ పాలనలో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధి వివరాలను సంక్షేమ బుక్‌లెట్ చదివి వినిపించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పులువురు ఇంటి స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరారు. సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను రానున్న ఎన్నికల్లో మళ్లీ ఆశీర్వదించాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ కార్యకర్తలు..**

గ్రామ రజకులు టీడీపీకి చెందిన చిన్న మల్లికార్జున, పెద్ద మల్లికార్జున, నరసింహుడు, సుంకన్న, ఆంజనేయులు, రామచంద్ర, కృష్ణమూర్తి, కుళ్లాయి స్వామితో పాటు మరో 20 మంది, సీపీఐకి చెందిన వెంకటరాముడు, పులిశేఖర్ తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో పార్టీలకతీతంగా ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరుతోందని, అందుకే టీడీపీ వారు సైతం జగనన్నకు అండగా నిలిచేందుకు ముందుకు వస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్ ఎంబాషా, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జిట్టా నాగేష్, జిల్లా కమిటీ సభ్యుడు రామచంద్రారెడ్డి, పీఎండీ హుసేన్, మోహన్‌రెడ్డి, నాగభూషణరెడ్డి, గోపాల్‌రెడ్డి, హనుమంతు, ఎర్ర నాగప్ప, ప్రతాపరెడ్డి, దేవి, రఘు, లోకనాథరెడ్డి, భాస్కర రెడ్డి, సోమశేఖరరెడ్డి, పక్కీరప్ప, తేరప్ప, సుంకప్ప పాల్గొన్నారు.

# మధ్య తరగతి ప్రజలకు గృహయోగం


ఎంఐజీ కాలనీ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

**ఎమ్మిగనూరురూరల్:** పట్టణ మధ్య తరగతి ప్రజల (ఎంఐజీ) సొంతింటి కల నెరవేర్చేలా స్మార్ట్ టౌన్‌షిప్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని బనవాసి ఫారం జాతీయ రహదారి పక్కన ఎంఐజీ కాలనీకి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా జగనన్న కాలనీలను నిర్మిస్తున్నారని చెప్పారు. అలాగే మధ్య తరగతి ప్రజలకు సౌలభ్యంగా ఉండేందుకు ఎంఐజీ కాలనీలు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. జాతీయ రహదారి పక్కన ఈ కాలనీ ఏర్పాటు చేయటం శుభ పరిణామమన్నారు. 20 ఎకరాల్లో ప్రస్తుతం చెట్లు తొలగించి ప్లాట్లు ఏర్పాటు చేస్తారని చెప్పారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం మధ్య తరగతి ప్రజలు ప్లాట్లు తీసుకోవచ్చునని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బీఆర్ బసిరెడ్డి, నల్లారెడ్డి, కుడా పీఓ విజయభాస్కర్, సంధ్య, డీఈ నాసిర్, తహసీల్దార్ జయన్న, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డీఈ మనోహర్‌రెడ్డి, ఆదోని మున్సిపల్ డీఈఈ నాగభూషణం, ఏఈ మధన్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రఘు, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, పట్టణ అధ్యక్షుడు బుట్టారంగయ్య, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

**పట్టణాభివృద్ధే లక్ష్యంగా పనులు**

**ఎమ్మిగనూరుటౌన్:** పట్టణ అభివృద్ధే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వెనుక గల అడివప్ప మఠం వద్ద రోడ్డును వెడల్పు చేసి కమిటీ రోడ్డు సమీపంలోని రోడ్డుకు కలిపేందుకు ఆ ప్రాంతాన్ని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డితో కలిసి పరిశీలించారు. రోడ్డు వెడల్పునకు తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. స్థానిక నాయకులు వెంట ఉన్నారు.

# లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న టౌన్ సీఐ

**ఎమ్మిగనూరురూరల్:** లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం పొందవచ్చని పట్టణ, రూరల్ సీఐలు మధుసూదన్‌రావు, మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్ అవరణల్లో లోక్ అదాలత్ నిర్వహించారు. ఆయా స్టేషన్లలో వారు మాట్లాడుతూ.. చిన్న చిన్న గొడవలకు కేసులు పెట్టుకొని స్టేషన్ల చుట్టూ పనులు వదులుకొని తిరగడం కన్నా రాజీ కావడం ఉత్తమమన్నారు. రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకుంటే సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. ఈ నెల 11 వరకు లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామని, వివిధ కేసుల్లో ఉన్నవారు రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. వీరితో పాటు టౌన్, రూరల్ ఎస్ఐలు మస్తాన్‌వలి, సునీల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

### ఘనంగా ఉరుసు

**వెల్దుర్తి:** స్థానిక వీరన్న గట్టు సమీపాన వెలసిన పెనుగొండ బాబయ్య (బాబా ఫక్రుద్దీన్) ఉరుసు గురువారం ఘనంగా జరిగింది. 5వ ఏడాది జరుగుతున్న ఉత్సవంలో భాగంగా తెల్లవారుజామున పట్టణంలోని కొలంబావి వీధి బాబయ్య పీర్లచావిడి నుంచి గంధోత్సవం ప్రారంభమైంది. పురవీధుల గుండా భక్తులు నీరాజనాలు పలికారు. పకీర్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. గంధం దర్గాకు చేర్చిన నిర్వాహకులు అక్కడ ప్రత్యేక ప్రార్థనలతో ఉరుసు నిర్వహించారు. భక్తులకు అన్నదానం కల్పించారు.

**కృష్ణగిరి:** మండల పరిధిలోని ఆలంకొండ గ్రామ శివారులో కొండపై వెలసిసిన దస్తగిరయ్య స్వామి ఉరుసును గురువారం గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. హిందు, ముస్లింలు గ్రామంలోని దర్గాకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున గంధాన్ని గుర్రంపై గ్రామ వీధుల గుండా ఊరేగించి స్వామికి సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి ప్రతిమను గుర్రంపై గ్రామ వీధుల గుండా ఊరేగించారు.

# చెరుకులపాడులో పోలీసుల పల్లెనిద్ర

**వెల్దుర్తి:** మండల పరిధిలోని చెరుకులపాడు గ్రామంలో గురువారం రాత్రి పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస్, వెల్దుర్తి సీఐ యుగంధర్, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి గ్రామంలో కలియతిరిగి పలు ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించారు. అనంతరం డీఎస్పీ గ్రామ ప్రజలతో సమావేశమై వారితో మాట్లాడారు. గ్రామ సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి సంబంధిత శాఖ అధికారులకు తెలియజేస్తామన్నారు.రక్షణ, శాంతిభద్రతల విషయంలో ఏ చిన్న సమస్య ఉన్నా తమకు సమాచారం అందించాలన్నారు. మహిళలు దిశ యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని సమస్యలపై యాప్‌ద్వారా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గొడవల జోలికెళ్లొద్దని, ప్రశాంత జీవనం గడపాలని, అన్ని వేళలా అందుబాటులో ఉంటామన్నారు.

### పన్ను వసూళ్లలో వేగం పెంచండి

**చిప్పగిరి:** ఇంటి, నీటి పన్ను వసూళ్లను వేగవంతం చేసి ఈ నెలాఖరులోగా 100 శాతం వసూళ్లు సాధించాలని ఎంపీడీఓ సుధాకర్ రాజు, ఈఓపీఆర్డీ సంజన్న పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి పన్నుల వసూళ్లపై పలు సూచనలు చేశారు.

### వృద్ధుడి అనుమానాస్పద మృతి

**ఎమ్మిగనూరురూరల్:** మండల పరిధిలోని టీఎస్ కూళ్లూరు గ్రామంలో గురువారం సాయంత్రం నరసింహారెడ్డి (68) అనే వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. నరసింహారెడ్డికి భార్య నాగమణి, కుమారుడు రామచంద్రారెడ్డి ఉన్నారు. భార్య, కుమారుడు కర్నూలులో నివాసముంటున్నారు. ఇదిలాఉండగా గురువారం సాయంత్రం నరసింహారెడ్డి ఇంట్లో రక్తపు మడుగులో పడిఉండటం గమనించిన పక్కింటి వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఇదే విషయంపై రూరల్ ఎస్ఐ సునీల్ కుమార్‌ను విచారించగా మృతుడి కుమారుడు రామచంద్రారెడ్డి.. తన తండ్రి కిందపడి మృతి చెందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడని, ఆ మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

# సూర్యప్రభ వాహనంపై చెన్నకేశవ స్వామి



**ఆలూరు:** దేవనకొండ మండలం కప్పట్రాళ్ల ఫారెస్ట్‌లో కొలువుదీరిన కొలుట్ల చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం శ్రీదేవి, భూదేవి సమేత ఉత్సవ మూర్తిని సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు. అంతకుముందు ధ్వజారోహన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు. రక్షబంధనం, ఆలయ సంప్రోక్షణ, కలశ స్థాపన, మండపారాధన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ హనుమంత రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# అన్నార్థుల ఆకలి తీర్చే ఆశ్రమం

- ప్రకృతి అందాల నడుమ విరాజిల్లుతున్న కాశిరెడ్డినాయన ఆలయం
- నేడు స్వామి వారి ఆరాధనోత్సవాలు


అవధూత కాశిరెడ్డినాయన ఉత్సవమూర్తి

**వెల్దుర్తి:** నెల్లూరు జిల్లా బెడుసుపల్లిలో జన్మించిన ఆధ్యాత్మిక గురువు అవధూత కాశిరెడ్డినాయన. ఆయన అసలు పేరు మున్నల్లి కాశిరెడ్డి. బాల్యంలోనే గురువు అతిరాచ గురువయ్య స్వామిచే ప్రభావితుడై అనేక తీర్థయాత్రలు చేసి పలు పాడుబడిన ఆలయాలకు జీర్ణోద్ధరణ చేసి నిత్యాన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూ వచ్చారు. అలా అన్నపూర్ణ వర ప్రసాదుడయ్యాడు. 1995లో స్వర్గప్రాప్తుడైన ఆయన పేరిట అప్పటికే తెలుగు నేల మీద దాదాపు వందకు పైగా ఆశ్రమాలు, గుళ్లు వెలిశాయి. ఆయా ఆశ్రయాలు వెలిసిన ప్రతిచోట విరివిగా గోసంపద పోషించబడుతూ నిత్యాన్నదానాలు జరుగుతున్నాయి. వాటిలో కోటపేట ప్రాంతంలో వెలసిన కాశిరెడ్డినాయన ఆశ్రమం ఒకటి.

**గురుభక్తితో అన్నదాన క్షేత్రం ఏర్పాటు**

పచ్చటి కొండలు, పారే సెలయేళ్లు, నెమళ్ల అరుపులు, వన్యప్రాణుల కేరింతలతో తులతూగుతుండే కోటపేట ప్రాంతంలో ఓ సామాన్య భక్తుడు ఏర్పాటు చేసిన చిన్నపాటి ఆశ్రమం ఇప్పుడు ఎందరికో కడుపు నింపుతోంది. అహోబిలం వద్ద కాశిరెడ్డినాయన సమాధిని సేవించిన ఆదర్శం, స్ఫూర్తితో వెల్దుర్తి మండలం శ్రీరంగాపురానికి చెందిన రామచంద్రారెడ్డి ఆయన భక్తుడిగా మారాడు. 13 ఏళ్ల క్రితం గ్రామ పరిధిలోని కోటపేట ప్రాంతంలో ప్రకృతి అందాల నడుమ కాశిరెడ్డినాయన విగ్రహాన్ని ప్రతిష్ఠించి చిన్నపాటి ఆశ్రమం నిర్మించాడు. భక్తుల విరాళాలతో కాశిరెడ్డినాయనకు ఆలయం నిర్మించాడు. పాత కోటపేట దుర్గం ముందటి ఆంజనేయ స్వామికి గుడి కట్టించి ధూపదీప నైవేద్యాలు సమర్పిస్తున్నాడు. ఆశ్రమం పక్కనే అన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి, శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయాలు నిర్మించాడు. నాగదేవత, నవగ్రహాలను ప్రతిష్ఠించాడు. గోసంపదను పోషిస్తున్నాడు. భక్తుల విరాళాలు, నిత్యావసర సరుకుల దానాలతో నిత్యాన్నదానం కొనసాగిస్తున్నాడు. పాలుట్ల రంగస్వామి ఆలయానికి విచ్చేసే భక్తులు, కొండ ప్రాంతంలో ఆలయ, అటవీ సిబ్బంది, గొర్రెలు, పశువుల కాపర్లకు, భక్తులకు, ఈ దారిగుండా ప్రయాణించే వారి ఆకలి తీరుస్తున్నారు. అంతెత్తున ఉన్న కొండల్లో అలనాటి కోటపేట బావి నేటికీ కాశిరెడ్డినాయన ఆశ్రమ వాసులకు, భక్తులకు దాహార్తి తీర్చుతోంది. వెల్దుర్తి, బేతంచెర్ల మండలాలను కలుపుతూ శ్రీరంగాపురం, గూటపల్లి మధ్య కొండల్లో గల ఈ ఆశ్రమానికి కార్తీక, శ్రావణ మాసాలలో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఏటా సంక్రాంతి తర్వాత వచ్చే గద్వాల పున్నమి రోజున ఆరాధన నిర్వహిస్తూ వస్తున్నారు.

**వృషభాల బండలాగుడు పోటీలు**

ఫిబ్రవరి 3వ తేదీ కొండపైన కోటపేట ఆంజనేయస్వామి గుడి ఆవరణలో న్యూ కేటగిరీ వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు శ్రీరంగాపురం గ్రామస్తులు తెలిపారు. విజేతలకు రూ.40 వేలు, రూ.35 వేలు, రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలు నగదు బహుమతులు అందించనున్నారు. అలాగే గుండు ఎత్తు పందెం నిర్వహించి విజేతలకు వరుసగా 4 తులాలు, 2 తులాల వెండి పతకాలు బహూకరిస్తామన్నారు. వివరాలకు 99483 24919, 79895 98987 నంబర్లలో సంప్రదించాలని కోరారు.


కాశిరెడ్డినాయన ఆశ్రమం

**నేడు ఆరాధనోత్సవం**

కోటపేట ఆంజనేయస్వామి, అవధూత కాశిరెడ్డినాయన 13వ ఆరాధనోత్సవాలు, అన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి, శ్రీలక్ష్మీ నరసింహస్వామి, నవగ్రహ, నాగదేవతల నాలుగవ వార్షికోత్సవం ఈ నెల 3వ తేదీన శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నాం. శ్రీరంగాపురం గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఉత్సవాలలో భాగంగా గణపతి పూజ, పల్లకీసేవ, ప్రత్యేక పూజలు, నందికోల సేవ, జ్యోతిజ్వాల కార్యక్రమాలుంటాయి. చెక్కభజన, కట్టె కోలన్న కార్యక్రమాలుంటాయి. భక్తులు విరివిగా పాల్గొని స్వామి వారి కృషకు పాత్రులు కావాలి.

– రామచంద్రారెడ్డి, కాశిరెడ్డినాయన ఆశ్రమ వ్యవస్థాపకుడు, శ్రీరంగాపురం

# గృహసారథులు బాధ్యతగా సేవలందించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

**పత్తికొండటౌన్:** గృహసారథులు జగనన్న సైనికులు అని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాల్సిన బాధ్యత వారిపై ఉందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. గురువారం పత్తికొండలో మండల పరిధిలోని సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులతో ఎమ్మెల్యే ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యం కల సాకారం చేయడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేశారన్నారు. ఇప్పటికే సచివాలయ సిబ్బందితో పాటు వలంటీర్లు ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. వారికి తోడు 50 ఇళ్లకు ఇద్దరు చొప్పున గృహసారథులను ఎంపిక చేశామన్నారు. గృహసారథులు, వలంటీర్లతో అనుసంధానమై పనిచేయాలన్నారు. వారిని పర్యవేక్షించడానికి సచివాలయ కన్వీనర్లు, మండలస్థాయి కన్వీనర్లు ఉంటారన్నారు. మీ ప్రాంతంలోని ప్రజలకు సేవ చేసే అవకాశం వచ్చిందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జగనన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజలకు సేవలందించాలన్నారు. ఎంపీపీ ఎం.నారాయణదాసు, నాయకులు ఎస్.నాగరత్నమ్మ, సోమశేఖర్, శ్రీరంగడు, కారం నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

### సబ్‌కోర్టు ఏర్పాటుకు కృషి చేయండి


ఆర్‌డీఓకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**పత్తికొండటౌన్:** రెవెన్యూ డివిజన్ కేంద్రమైన పత్తికొండలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు (సబ్ కోర్టు) ఏర్పాటు చేయాలని న్యాయవాదులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం పత్తికొండలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జున ఆధ్వర్యంలో న్యాయవాదులు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఆర్‌డీఓ మోహన్‌దాసులను కలసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తికొండ రెవెన్యూ డివిజన్ పరిధిలో పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లోని 9 మండలాలు, 12 పోలీసుస్టేషన్లు ఉన్నాయన్నారు. పత్తికొండలో సబ్‌కోర్టు ఏర్పాటైతే కక్షిదారులు, ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సబ్‌కోర్టు ఏర్పాటుకు తనవంతు కృషిచేస్తానని ఎమ్మెల్యే న్యాయవాదులకు హామీ ఇచ్చారు. న్యాయవాదుల వినతిని జిల్లా అధికారులకు పంపుతానని ఆర్‌డీఓ హామీ ఇచ్చారు.

### నేడు ఆలూరు ఎంపీపీ ఎన్నిక

**ఆలూరు రూరల్:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల అధ్యక్షురాలి ఎన్నిక పరోక్ష పద్ధతిలో నిర్వహించనున్నట్లు ఆలూరు మండల ఎన్నికల అధికారి శాంతన్న తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. ఆలూరు ఎంపీపీ బూర్ల సుభాషిణి (50) అనారోగ్యంతో గత ఆగస్టు 24వ తేదీన మృతి చెందడంతో ఆ స్థానం ఖాళీగా ఉంది. ఇందులో భాగంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎంపీపీ ఎన్నిక కోసం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆలూరు ఎంపీపీ స్థానం ఎస్సీ మహిళకు (రిజర్వ్) ఉంది. ప్రస్తుతం మండలంలో కమ్మరచేడు గ్రామ ఎంపీటీసీ రంగమ్మ, ఎం.కొట్టాల ఎంపీటీసీ లలితమ్మ మండల అధ్యక్ష పదవికి అర్హులుగా ఉన్నారు. వీరిలో ఒకరిని మండల అధ్యక్షురాలిగా ఎంపీటీసీలు చేతులు ఎత్తి మద్దతు తెలిపే పద్ధతిలో ఎన్నుకుంటారని ఎన్నికల అధికారి చెప్పారు. మెజారిటీ కోరం (8 మంది) సభ్యుల నిర్ణయంతో ఏకగ్రీవం చేసుకోవచ్చని తెలిపారు. ఎంపీపీకి పోటీ చేసే వారు నామినేషన్ దాఖలు చేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థిని బలపరిచేందుకు, ప్రతిపాదించేందుకు ఒక్కో ఎంపీటీసీ ఉండాలని వెల్లడించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం 11 గంటలకు అన్ని స్థానాల ఎంపీటీసీలు హాజరుకావాలన్నారు.

### చిన్నారి మృతిపై విచారణ


విచారణ చేస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి

**ఎమ్మిగనూరుటౌన్:** పట్టణంలోని చిన్నారి చిన్నపిల్లల ఆస్పత్రిలో ఇటీవల 10 నెలల ఆడ శిశువు మృతి చెందిన ఘటనపై గురువారం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి విచారణ చేపట్టారు. చికిత్స వికటించి గత నెల 28వ తేదీన శిశువు మృతి చెందిందంటూ తల్లిదండ్రులు, యువజన, విద్యార్థి సంఘాలు ఆస్పత్రి ముందు ఆందోళనకు దిగిన విషయం విధితమే. దీనిపై జిల్లా కలెక్టర్‌కు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ గురువారం స్థానిక ఆస్పత్రిని తనిఖీ చేసి బాలిక తల్లిదండ్రులను విచారించారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

**అనుమతి లేని ల్యాబ్‌లపై చర్యలు తీసుకోండి**

వైద్య శాఖ అనుమతుల్లేకుండా పట్టణంలో నిర్వహిస్తున్న డయాగ్నోస్టిక్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని చిన్నారి ఆస్పత్రిలో విచారణ జరిపేందుకు వచ్చిన డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతికి వినతి పత్రం ఇచ్చారు.

# మహిళలు జీవనోపాధి మెరుగుపరుచుకోవాలి


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ వెంకటసుబ్బయ్య

**వెల్దుర్తి:** ప్రభుత్వం అందించే పథకాలు, రుణాలను, సౌకర్యాలను ఉపయోగించుకుని మహిళలు జీవనోపాధి మెరుగుపరుచుకోవాలని డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ వెంకటసుబ్బయ్య సూచించారు. గురువారం ఆయన స్థానిక రాణితోటలోని రాజరాజేశ్వర స్వామి (పశువుల) దేవాలయంలో ఏపీఎం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఇప్పటివరకు వివిధ పథకాల ద్వారా లబ్ధి పొంది ఆర్థిక ప్రగతి సాధిస్తున్న మహిళల వివరాలు తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. పీడీ మాట్లాడుతూ.. ప్రతి మహిళకు అదనపు ఆదాయం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఇందులో భాగంగా పెరటి కోళ్లు, గుడ్లు పెట్టే కోళ్లు, పొట్టేళ్ల పెంపకం, పాలిచ్చే గేదెలు, ఆవుల పోషణ, వస్త్ర, టైలరింగ్, కిరాణం తదితర దుకాణాల నిర్వహణకై యూనిట్లు అందిస్తున్నామన్నారు. ఆయా యూనిట్లు ఏర్పాటు చేసుకోదలచిన మహిళలకు వైఎస్సార్ చేయూత, జగనన్న తోడు, స్త్రీ నిధి, ఉన్నతి, వివిధ రకాల బ్యాంకు లింకేజీ పథకాల ద్వారా రుణాలందించడంతోపాటు, యూనిట్లు సరఫరా చేస్తామన్నారు. ఆయా ఉత్పత్తులకు లాభదాయక మార్కెటింగ్ సౌకర్యం సైతం కల్పిస్తున్నట్లు తెలిపారు. అవకాశాలను పొదుపు మహిళలు ఉపయోగించుకోవాలని కోరారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తులసిరెడ్డి, గ్రామైక్య సంఘాల ప్రతినిధులు, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

# ముగిసిన సిద్ధేశ్వర స్వామి ఉత్సవాలు

**హొళగుంద:** ఆంధ్రా, కర్ణాటక సరిహద్దు గ్రామాలతో పాటు మండల ప్రజల ఆరాధ్య దేవుడు సిద్ధేశ్వర స్వామి జాతర గురువారం వసంతోత్సవ కార్యక్రమంతో వైభవంగా ముగిసింది. గత 26న కంకణధారణతో ఉత్సవాలు ప్రారంభమైన సంగతి తెలిసిందే. అందులో భాగంగా 31న రథోత్సవం, ఈ నెల 1న లంకాదహనం ఘనంగా నిర్వహించారు. గురువారం వసంతోత్సవంలో భాగంగా ఆలయంలో సిద్ధేశ్వరునికి ఆకుపూజ, మహామంగళారతి, అభిషేక పూజలు చేపట్టారు. అనంతరం రాత్రి పల్లకిలో ఉత్సవ మూర్తులను ఉంచి ఊరేగింపుగా ఆలయ పూజారుల ఇంటికి చేర్చడంతో ఉత్సవాలు ముగిశాయి.

### భయం వీడి పరీక్షలకు సిద్ధం కావాలి

**కృష్ణగిరి:** విద్యార్థులు భయం వీడి పరీక్షలకు సిద్ధం కావాలని జీసీడీఓ సునీత సూచించారు. కృష్ణగిరిలోని కస్తూర్బా విద్యాలయాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. సీ, డీ గ్రేడుల్లో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పనిచేయాలని ఎస్ఓ సునీతకు సూచించారు. పరీక్షల సమయం దగ్గర పడుతుండటంతో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఏకాగ్రతతో చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం భోజనశాలను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

### ఈ-కేవైసీ తప్పనిసరి

**ఆలూరు:** మండలంలో ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకున్న రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ నమోదు చేయించుకోవాలని పత్తికొండ ఏడీఏ విజయ్‌మోహన్‌కుమార్ సూచించారు. దేవనకొండలోని రైతు భరోసా కేంద్రాన్ని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్‌బీకే సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి నాలుగైదు రోజుల్లోగా ఈ-కేవైసీని పూర్తి చేయాలని ఆదేశించారు. ఏఓ సురేష్‌బాబు, ఏఈఓలు యోగేంద్ర, జయరామ్, రంగన్న, వీఏఏస్‌లు ఉన్నారు.